

# ప్రహారం

## చందు సోంబాబు

రాత్రి పది దాటింది. చలిగాలి రివ్వు రివ్వున వీస్తోంది. నాయుడుగారు ఉత్తరీయాన్ని వీపు చుట్టుతా కప్పుకున్నారు. పక్కనే వున్న చేతి సంచీ జాగ్రత్తగా వున్నదీ లేందీ చూసుకొని, జేబులోంచి చుట్టపాయ తీసి చుట్ట చుట్టి వెలిగించారు.

ప్లాటుఫారం చాలా రద్దీగా వుంది. నాయుడుగారు ఒక్కసారి చూపుని చుట్టూ కలియబెట్టారు.

విపరీతమైన జనం. మరో గంటలో మద్రాసు నించి హైదరాబాదుపోయే బండి వస్తుంది.

నాయుడుగారికి ఆ వూళ్లో తెలిసిన వాళ్ళెవరూ లేరు. వూరంతా పిచ్చి పట్టినట్టుగా కాలి సత్తువ కొద్దీ తిరిగేరు. ఇప్పుడు నుంచునేందుకు కూడా ఓపిక లేదు. కాళ్ళు తెగ పీకేస్తున్నాయి.

కడుపులో ఆకలి కూడా దంచుతోంది.

నాయుడుగారు ఆలోచనల్లో పడిపోయి అప్పటి వరకూ ఆకలి సంగతి మర్చిపోయారు. మెల్లగా కాంటీన్ దగ్గరకి నడిచేరు. అక్కడా జనమే. ఈ జనం ఎక్కడ్నించి పుట్టుకొస్తున్నారో నాయుడుగారికి అంతు పట్ట లేదు. జనాన్ని తప్పించుకొని నలభై పైసలు పెట్టి పెరుగు అన్నం పొట్లం కొనుక్కొన్నారు. ఆత్రుతగా దాన్ని పూర్తిచేసి కుళాయిలో నీరు తాగేరు. దాంతో ప్రాణం కాస్త కుదుటపడినట్టనిపించింది.

అంత పెద్దవయసులో తనిలా దిక్కులేని పక్షిలా దేశాలుపట్టిపోవాల్సివస్తుందని నాయుడుగారు కలలో సైతం అనుకోలేదు.

తనకీ ఓ వూరుంది. ఆ వూర్లో తనదైన ఇల్లూ వుంది. ఇద్దరు కొడుకులు. కోడళ్లు, మనవలూ వున్నారు.

శాంత సంవత్సరంక్రితం పోయింది. శాంత వున్నంత కాలం ఆయనకి ఏ లోటూ తెలీదు.

ఆ ఇల్లాలు కాస్తా తనని వంటరిగా వదిలేసి తన దారి తాను చూసుకొంది.

శాంతతో నాయుడుగారి అనుబంధం ముప్పైఏళ్లది. నాయుడుగారికి కళ్లలోకి నీరు ఉప్పెనలా పొంగింది.

పెళ్ళిపీటలపైన తనని క్రీగంట చూస్తూ సిగ్గుపడిన శాంత, తలంబ్రాల పళ్ళెం సైతం ఎత్తి తననెత్తిన తలంబ్రాలన్నీ పోసిన శాంత, బిందెలో వుంగరాన్ని గెలుచుకోడానికని తెగ ప్రయత్నించి, ఓడిపోతున్నానన్న ఉక్రోషంతో తన చేతిని గట్టిగా గిల్లిన శాంత, తనతో ముప్పైఏళ్లు స్నేహంగా సంసారంచేసి కనుచూపు మాత్రంలో దగాచేసి పారిపోయింది.

కొడుకుల్ని కళ్ళల్లో పెట్టుకొంది శాంత.

తల్లి పైన వాళ్ళకి ఇష్టమే. అది ఉన్నంత కాలం తనకి తెలిసిరాలేదు.

"అదృష్ట వంతురాలివే శాంతా! నీ కొడుకులూ, కోడళ్ళూ ఒకటైపోయి, ఈముసలాడ్నిబయటికితరిమేశారేశాంతా. రెక్కలు ముక్కలు చేసుకొనివెధవల్ని చదివించి ఇంతవాళ్ళని చేస్తే నాఇంట్లోనుంచే నన్ను బయటికి నడిపించేరే నీ సుపుత్రులు. వాళ్ళకి పెళ్ళాలేగానీ, తండ్రినన్న గౌరవంగానీ, తండ్రి అవసరంగానీ లేకపోయాయే శాంతా! ఇక నేనిక్కడ వుండలేను. నువ్వెక్కడున్నావో చెప్పు శాంతా, నేనూ వచ్చేస్తాను."

నాయుడుగారు ఇల్లొదిలి పదిహేను రోజులైంది. ఇంటి వేపుకి గాలి, మనసుని మళ్ళించినా మొండిగా కోరికని చంపుకొంటున్నారు. అదీగాక తన 'జాడ' వాళ్ళకి తెలీకపోయిందే అన్న బాధ మరింతగా ఎక్కువై పోయింది.

అవును మరి!

అనామిక

తనేమైపోతే వాళ్ళకేం? తను చచ్చినదీ, బ్రతికినదీ కూడా వాళ్ళకి తెలీకపోవడమే మంచిది

వాళ్ళ కాపురాలు వాళ్ళకున్నాయి. ఈ రోజు కాకపోయినా ముందొచ్చే రోజుల్లో అయినా గ్రహిస్తారు తండ్రి అంటే ఏమిటో వాళ్ళకీ ఎదుగుతున్న పిల్లలున్నారు. తన మనవలు కూడా, తనకొడుకుల్లాగే ఏడిపిస్తారు.అప్పుడు తెలుస్తుంది. నాయుగారికి ఉక్రోషం, బాధ, పేట్రేగి పోయినాయి.

ఇలాంటి దౌర్భాగ్యపు కొడుకుల కన్నా, ఒక్క కూతురేవుంటే తనని కంటికి రెప్పలా కాపాడుకొనేది తలి దండ్రుల పైన ఆడపిల్లలకుండే ప్రేమ, అభిమానం, కొడుకుల కుండవని ఆయన అభిప్రాయం.

రైలొచ్చింది. బండి నిండా జనమే. హైదరాబాదు గురించి నాయుడుగారు వినడమే గానీ ఎప్పుడూ చూళ్ళేదు. ఆంధ్రుడై వుండి రాజధానిని కళ్ళారా చూడకపోవడం తప్పని ఆయన వుద్దేశ్యం. రైలు కదలడానికింకా అరగంట టైం వుంది.

నాయుడుగారు ఆ జనాన్ని తప్పించుకొని బండెక్క లేకపోయారు. టి. సి.ని బ్రతిమాలి స్లీపర్‌కోచ్‌లో సీటు సంపాదించుకొన్నారు.

నాయుడుగారి దృష్టి తన కెదురుగా కూర్చున్న ఓ వయసుగల మనిషి పైనపడింది. ఆయన ప్లాటుఫారంపైన నించున్న కొడుకుతోనూ కోడలితోనూ మాట్లాడుతున్నారు. ఆయన కొడుకు చేతిలో సంవత్సరం పిల్లాడు కూడా వున్నాడు.

అతనంటున్నాడు.

"రెండు రోజులన్నా వుండకుండా ఇలా వెళ్ళిపోవడం నాకు ఏమీ బాగా లేదు నాన్నా. మీ రసలు వచ్చినట్లే లేదు."

అందుకాయన నవ్వేరు.

కోడలు నిష్ఠూరంగా అంది.

"అవునండీ మామగారికి మనమంటే అసలిష్టం వుండదు. అందుకే ఇలా వెళ్ళిపోతున్నారు. పెద్ద అక్కడేదో పని పీకలమీదున్నట్టు హడావిడి. నాకు తెలుసు. మా కెప్పుడూ దూరంగా ఉండడానికే ప్రయత్నిస్తారు మీరు. ఒంటరిగా మీ రొక్కరూ అక్కడవుండే దాని కన్నా మా దగ్గరవుంటే మాకు సంతోషంగా వుంటుంది."

ఆయన కోడలి తలపైని వాత్సల్యంగా చేత్తో నిమిరారు.

"చూడమ్మా, మీరు వయసులోవున్న వాళ్ళు. నేను పెద్దవాణ్ణి. నేను మీ దగ్గిరున్నకొద్దీంచి ఓ విధంగా నేను మీకు ప్రతి చిన్న విషయానికీ అడ్డే అవుతాను."

"అలా ని మీ రనుకొంటున్నారా నాన్నా! అదీకాక మీరు చెప్పిన మాటకి

మే మెప్పుడైనా అడ్డుచెప్పామా ?"

"అదికాదురా రాముడూ, మీ రెంత పెద్దవాళ్ళవుతున్నా, ఆఫీసర్లయిపోయినా నా కళ్ళకి మీరు పసివాళ్లే. వయసువున్న మీకు సరదాలపైన వ్యామోహం వుంటుంది వాటికి మీ ముందు పెద్ద కొండలా అడ్డే అవుతాను నేను. మొదట్నుంచి చాలా ఫ్రీగానూ, స్వతంత్రంగానూ బ్రతికే తత్వం నాది. నా పనులు నేను చేసుకోడం నా కలవాటు. దానికి మీరు ఒప్పుకోరు. నువ్వు ముసలాడివి, నువ్వు కదలకుండా ఓమూల కూర్చో, రెస్టు తీసుకో అని మీ రంటారు. అది నా కిష్టం వుండదు."

"చిన్న విషయాన్ని పెద్దగా వూహించడం మామగారికి మొదట్నుంచీ అలవాటే."

కోడలి మాటలకి ఆయన మెరిసిపోయిన మీసాలు పైకి తోసుకొని అన్నారు :

"ఒరే రాముడూ, మీ అమ్మ పోయి చాలా కాలమయింది. నాకుంది నువ్వూ, మీ తమ్ముడూను. అమ్మ పోయిందన్న లోటు లేకుండా మిమ్మల్ని పెంచాను. పెళ్ళిళ్ళు చేశాను. ఉద్యోగా లిప్పించి మీ క్కావల్సిన సదుపాయా లన్నిటినీ కల్పించి, మిమ్మల్ని వేరే కాపురాలు పెట్టించి దూరంగా పంపించేశాను. నా దగ్గరే మిమ్మల్ని అట్టే పెట్టుకున్నా, నే నొచ్చి మీ దగ్గరున్నా ఈ ప్రేమా, ఆత్మీయతా, తరిగి పోతాయిరా. నాకు తోచింది చెయ్యడమే గానీ ఒకళ్ళు చెప్పింది వినడం నాకు గిట్టదు. ఈ రోజిలా మీకు దూరంగా వుండి మీ క్షేమ సమాచారాలు చూసుకోడంలో వున్న తృప్తి, మీ దగ్గరుంటే ఆ తృప్తి నాకు లభించదురా రాముడూ !"

"అవున్నాన్నా. నీ వెప్పుడూ ఇంతే! అమ్మే వుంటే మా మాటని కాదనగలిగే వాడివా ?" అన్నాడు రాముడు.

ఆయన తీవిగా నవ్వి :

"అది సరే, రిఫ్రిజిరేటర్ రాంగానే వైరివ్వు డబ్బు పంపిస్తాను. అలాగే అమ్మాయి ఒకటి మనిషికాదు, జాగ్రత్తగా చూసుకో. మా ఫ్రెండ్‌కి ఫోన్‌చేశాను. ఇంటిపట్టున కోడల్ని కనిపెట్టుకొనుండడానికి మనిషి వస్తుంది"


"మీ కెంతసేపూ మా సుఖం మా జాగ్రత్తేగానీ మీ విషయం ఏమీ ఆలోచించరేం మామగారూ" కోడలు దిగులుగా అడిగింది. ఆ మాటలు విన్న నాయుడుగారికి జెలసీ కలిగింది.

తనకీ వున్నారు.

ఎందుకు అనుకున్నారు.

కానీ తనెందువల్ల ఆ స్థితికొచ్చిందీ చాలావరకు అర్థం అయింది, నాయుడు గారికి.

మాటల్నిబట్టి ఎదటాయన పేరు గోపాలస్వామి అని, కంట్రాక్టరు అని తెలుసుకొన్నారు నాయుడుగారు.




ఆ వయసులో ఆయన అంత సుఖంగా ఎందువల్ల బ్రతగ్గలుగుతున్నదీ, కొడుకులూ, కోడళ్లూ ఎంచేత గోపాలస్వామిగారంటే భయాన్నీ, భక్తినీ, ప్రేమనీ కలిగున్నారో కూడా గ్రహించారు.

గోపాలస్వామి లక్షాధికారి. ఆ స్తినీ, అంతస్తునీబట్టి అభిమానాలు పెరుగుతాయనిపించింది నాయుడుగారికి.

రైలు కదలబోతోంది. రైలు కదిలితే ఆ ముసలాయన తిరిగి కనబడరేమో అన్న ఓ తపన ఆ జంటకళ్ళలో గోచరించింది. గోపాలస్వామిగారు మన వడి తలపైన చేత్తో నిమిరి కళ్ళు తుడుచుకొన్నారు.

రాముడు అంటున్నాడు.

“కాజీపేటలో తమ్ముడు స్టేషను కొస్తాడు నాన్నా!”

గోపాలస్వామి గారు నెరిసిపోయిన మీసాల్ని దువ్వుకుంటూ గర్వంగా అన్నారు.

“వస్తాడ్రా. ఇప్పటివరకూ నువ్వునా ప్రాణం తీశావ్. ఇక వాడేం నిష్ఠూరం వేస్తాడో.”

“ఆ మాటల్లో ఆయనకి కొడుకుల పైన గల ప్రేమ కొట్టొచ్చినట్లుగా కనబడింది.

రైలు కదిలింది.

గోపాలస్వామిగారి కోడలు, కొడుకు రైలు వెనకే వస్తున్నారు, గాలిలోకి చెయ్యి విసురుతున్నారు.

గోపాలస్వామిగారి కేసి చూశారు నాయుగారు. ఆయన పేపరు తీసి చదువుకొంటున్నారు.

నాయుగారికి తను చేసిన తప్పేమిటో తెలిసింది.

తను కొడుకుల పైన తన అధికారాన్ని చూపించుకోడానికి ప్రయత్నించినట్లుగా అనిపించింది.

పెద్దాడికి పేకాట పిచ్చి.

రెండోవాడు సెకెండు షో సినిమాలు. వేళకింటి కొచ్చి భోజనం చెయ్యడు ఇవన్నీ నాయుగారికి తలనొప్పి కలిగించే విషయాలు. పిల్లల్ని ఎవరేనా ఏమన్నా అంటే చాలు చిన్న కోడలు పంచాంగం విప్పి ఇక ఆపేది కాదు. వేళకొచ్చి భోజనం చెయ్యరా అని చిన్నాడ్ని, పెద్దాడ్ని పేకాట తప్పురా, కావాలంటే కూర్చో, వామన గుంటో గవ్వలో ఆడదాం అనీ అనేవారు. ఇది రోజూ తను వాగడం, లెక్కలేనట్టుగా వాళ్ళవే పనులు చెయ్యడం తనకి చాలా కష్టం కలిగించేయి. తను కన్నవాళ్ళు వెధవలు. తన మాట వినాల్సిందే. అది రూలు.

ఆ రూలు నతిక్రమించి వాళ్ళకి తోచింది వాళ్ళు చేస్తే సహించేదెలా? నాయుడుగారి పిల్లలు పాడై పోతున్నారని ఎవరైనా అంటే తన పరువేం గాను?

కోడలు పిల్లాడ్ని కొట్టింది. అది చూడలేక.

"తప్పమ్మాయి. పసివెధవ, వాడ్నలా కొట్టి చంపకు. చూశ్నేను" అన్నారు.

దాంతో కోడలు విరుచుకు పడింది.

"నా పిల్లాడు, నా ఇష్టం. కొట్టుకుంటాను. చంపుకుంటాను. మీకనవసరం"

"అవునమ్మా నాకనవసరమే. బాగా చెప్పావ్. చూడుతల్లీ ఈ రోజున నా కొడుకులు నాకు కిరీటాలు పెటారు. చూస్తూన్నావుగా! రేపు వాళ్ళూ అంతే! మురిసిపోకు" అన్నారు కోపం వచ్చి.

కోడలు రెచ్చిపోయింది.

"ఏదో వేళకింత తిండి పడేస్తున్నాము. అది తిని పడుండక ప్రతి విషయంలోకీ రావడం మంచిది కాదు" అని లోపల కెళ్ళిపోయింది.


ఆ సాయంత్రం చిన్నాడు అన్నాడు.

"చూడు నాన్నా, అదసలే పనితో చచ్చిపోతోంది.దాంతో నీకెందుకుచెప్పు."

నాయుడుగారికి తనేం మాట్లాడాలో తెలీలేదు. పెళ్ళాన్ని వెంటేసుకొని తనకే నీతులు చెపుతున్నాడు సన్నాసి.ఇక తను ఆ ఇంట్లో వుండకూడదనిపించింది. రాత్రికి రాత్రే ఎవ్వరూ చూడకుండా ఇంట్లోంచి వచ్చేశారు.

పదిహేను రోజులైంది.

మనసు ఒకపక్క ఇంటికి పోవాలని తహతహ లాడుతోంది. పదిహేను రోజులు కాదుకదా, పదిహేను గంటలు




కూడా వాళ్ళ నొదిలి ఇంతకు పూర్వం ఆయ నెప్పుడూ వుండలేదు.

నాయ్డుగారి కనిపించింది.

గోపాలస్వామిని చూసి చాలా నేర్చుకోవాలి. పిల్లల్ని కనగానే సరికాదు. వాళ్ళని పెంచే విధానంలోనూ, ఆత్మీయతను పెంచుకొనే విధానంలోనూ చాలా సున్నితంగా ప్రవర్తించాలి.

దానికి తగ్గట్టుగా లక్ష్మీదేవి తోడుంటే అందరూ గోపాలస్వాములే అవుతారు.

గోపాలస్వామిని ఆదర్శంగా పెట్టుకొన్నారు నాయ్డుగారు.

నాయ్డుగారు కొడుకులికి పెళ్ళిళ్ళు చేశారు. ఉన్న ఇంట్లోనే అట్టేపెట్టారు. వాళ్ళకి కావలసిన ఇతరత్రా ఏ విధమైన వసతుల్నీ కల్పించలేకపోయారు. అదీ కాక కేవలం తనకొచ్చే పెన్షన్ డబ్బు ఇచ్చి వాళ్ళపైన ఆధారపడ్డారు. అందుకే కోడలు అంత తేలిగ్గా అనగలిగింది

తనదగ్గరే డబ్బుంటే కొడుకులు తన మాటనీ వేదంగా భావించేవారు.

అప్పుడు పెద్దాడు పేకాట ఆడడు. చిన్నవాడు రెండోఆట సినిమాలకెళ్ళడు.

కోడళ్ళకి మామగారు ఇంట్లో వున్నారన్న భయం వుంటుంది.

నదీప్రవాహానికీ, సెలయేటి ప్రవాహానికీ, సముద్రప్రవాహానికీగల వ్యత్యాసం ఎలాంటిదో ఈ వయసు కూడా అలాంటిదే.

వయసులో వచ్చిన వ్యత్యాసం చేతనే పిల్లలకీ తలిదండ్రులికీ మధ్య సాన్నిహిత్యం దూరం అయిపోతుందనిపిస్తుంది.

ఆలోచనల్లోనే నిద్రలోకి జారిపో

యారు నాయుడుగారు.

కళ్ళు విప్పేసరికి రైలు సికింద్రాబాదు స్టేషన్లో ఆగివుంది. ఎదురుగా గోపాలస్వామి లేడు.

రైలు చాలావరకు ఖాళీ అయిపోయింది.

స్టేషన్లో దిగి మొహం కడుక్కొని కాంటీన్లో కాఫీ తాగారు.

పేపరు కొనుక్కొని రైలెక్కి కూర్చున్నారు. రైలు కదిలింది

రెండో పేజీలో తన ఫోటో. దాని కింద, "నాన్నా, నువ్వెక్కడున్నా వెంటనే ఇంటికిరా. నీ కోసం మేం తపించిపోతున్నాం. ఇంకెప్పుడూ నీకు కష్టం కలిగేలా ఎవ్వరం ప్రవర్తించం. నీ చెప్పుచేతల్లో నీ మాట ప్రకారంగా నడచుకొంటాము. నీ కోసం నీ మనవళ్ళు బెంగపెట్టుకొన్నారు."

అది చదివిన నాయుడుగారి కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. పిల్లలపైన అవ్యాజమైన ప్రేమ వుప్పెనలా పొంగిపోయింది ఆయనకి.

తన కొడుకులు తనని మర్చిపోలేదు తనకోసం తపించిపోతున్నారు. వెదుకుతున్నారు. పేపర్లో ప్రకటన వేస్తున్నారు. జరిగిందానికి బాధపడుతున్నారు.

తనకి అంతకంటే ఏం కావాలి?

కానీ తను ఇంటికి వెళ్ళలేరు.

గోపాలస్వామి కళ్ళముందు కదిలేడు.

గోపాలస్వామిని ఆదర్శంగా పెట్టుకొంటారు. ఆయనకి తన శక్తిపైన తనకి నమ్మకం వుంది.

"వెదకకండి బాబూలూ వెదకకండి. వూరూరా తిరిగి వెదకకండి. నాకోసం పేపర్లలో ప్రకటనలువేస్తూనే వుండండి. నేనురాను ఇక చాలు"

నాయుడుగారు కళ్ళొత్తుకొన్నారు. రైలు నాంపల్లి స్టేషన్లో ఆగింది.

బిక్కుబిక్కుమంటున్న గుండెతో ఆ మహానగరంలో, ఆ మహాప్రపంచంలో, సంకల్పాన్ని నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో నాయుడుగారు కాలు పెట్టారు.

## శ్రమ సాధ్యమ్ సత్కావ్య గుణమ్

ఏకైక దిన ప్రబంధ ఘటికా సద్య శ్శత గ్రంథకల్పన, కొందరి మతమున కవితకు మేర. ఇతరులు అర్థపటుత్వ, శబ్దౌచిత్యములను సాధించుటకు మిక్కిలి శ్రమ చేతురు. చిత్రములు వ్రాయునపుడూ, శిలుగు చెక్కునపుడూ, శిల్పకుడు యెట్టి పరిశ్రమ చేయునో అట్టి పరిశ్రమ చేసిన గాని కావ్యగుణము లబ్బనేరవని నా మతము.

—గురజాడ